క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట : మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ అంజనేయస్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిపించారు. ప్రతీ నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి కోసం హోమం జరిపించుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. హోమంలో పాల్గొనాలనుకునే వారు రూ.516 చెల్లించాలి.

కనకమహాలక్ష్మి ఆలయంలో పౌర్ణమి పూజలు



శ్రీచక్రనవావర్ణార్చన నిర్వహిస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి దేవస్థానంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం జరిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం



డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద రంగంలో నిష్ణాతులైన డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజులపాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల ఔషధాలయంలో బుధవారం శిబిరం వివరాలు వెల్లడించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మురళీనగర్, శ్రీదేవి పార్క్ వద్ద గల ఔషధాలయంలోనూ, 18, 19న జీవీఎంసీ ఎదురుగా గల రామ్‌నగర్‌లో గల వైద్యరాజ్ ఔషధాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్టు దినూప్ తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటీస్ (కీళ్ల వ్యాధులు), పక్షవాతం, నడుము నొప్పి, స్పాండిలైటీస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక చికిత్స అందజేయనున్నారని చెప్పారు. అవసరమైన వారు 80080 00670, 90305 68264లో సంప్రదించాలని సూచించారు.

పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



డార్విన్ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం: విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. డార్విన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి కళాశాల స్థాయిని పెంచాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయ మాట్లాడుతూ విద్యార్థులు తమ జ్ఞానాన్ని సమాజ ప్రగతికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పి.ఉమామహేశ్వరరావు, జి.విజయ ప్రతాప్, జంతుశాస్త్ర అధ్యాపకులు శాంతి ప్రభ, రామారావు, భూషణ్ రావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



టౌన్ కొత్త రోడ్డు నుంచి రీడింగ్ రూమ్ వరకు బంగారు దుకాణాలు (రోడ్డు విస్తరణ జరగక ముందు)



రీడింగ్ రూమ్ నుంచి కురుపాం మార్కెట్ వరకు బంగారు దుకాణాలు (రోడ్డు విస్తరణ తర్వాత)

గతమంతా స్వర్ణ వైభవం



డాబాగార్డెన్స్

పాతనగరం.. విశాఖ గతకాల ఘనకీర్తులకు నిలువుటద్దం. అలనాటి ఔన్నత్యానికి, హుందాతనానికి నిదర్శనం. విదేశీ వర్తకుల, ఉద్యోగుల రాకతో ఇక్కడ నాగరికత కొత్త హొయలు పోయింది. అలనాటి సంపన్న కుటుంబాల దర్పానికి ఈ ప్రాంతం ప్రతిరూపంగా నిలిచింది. విద్యల వన్నె చిన్నెలతో వెలుగులీనింది. ఆధునిక సౌకర్యాలకు నెలవైంది. ఇంత ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతంలో, అప్పట్లో బంగారు వ్యాపారం విరాజిల్లింది. ధనికులు, ఉన్నతోద్యోగులు ఉన్న ప్రాంతం కావడంతో పాత నగరంలోని కురుపాం మార్కెట్ బంగారు అంగడిగా ఖ్యాతికెక్కింది. కాల క్రమంలో నగరం ఆశీలుమెట్ట వైపు విస్తరించడంతో వ్యాపారం అటువైపు మళ్లిపోయింది. సుమం వాడినా సుగంధం మాత్రం నేటికీ నిలిచిపోయింది.

1913లో తొలి దుకాణం ఏర్పాటు

సిరిసంపదలకు ఆలవాలమైన అలనాటి హంపీ విజయనగరంలో రత్నాలు, వజ్ర, వైఢూర్యాలు రాశులుగా పోసి అంగళ్లలో విక్రయించారని చరిత్ర చెబుతోంది. వందేళ్ల నాటి విశాఖపట్నం ఆ తరహాలోనే కళకళలాడేది. పాతనగరంలోని కురుపాం మార్కెట్ వీధుల్లో ఇళ్ల ముందున్న అరుగుల మీద బంగారు నగలు అమ్మే వారని నగర చరిత్రను గమనిస్తే అర్థమవుతుంది. పెళ్లికి కావాల్సిన తాళిబొట్టు.. కాలి మెట్టెలు, చిన్న చిన్న గొలుసులు, చిన్నారులకు చెవిపోగులు, మహిళల చెవి కమ్మలు, దుద్దులు, ముక్కుకు ముక్కెర వంటి ఆభరణాలను బంగారు వర్తకులు ఇళ్లముందు పెట్టుకొని అమ్మినట్టు నగర చరిత్ర చెబుతోంది. **1880 నాటికి నగరం ఇంత వైభవంతో విలసిల్లేది. 1913లో కురుపాం మార్కెట్ ప్రాంతం**లో ఇప్పటి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద 'అగ్రహారపు జ్యూయలరీ' పేరిట చెరుకూరి ధర్మరాజు **తొలి** బంగారు **నగల** దుకాణం ప్రారంభమైంది. అలా మొదలైన బంగారు వ్యాపారం నగరంలో ఎన్నో సోయగాలను **అద్దుకుని** నేటి ఉజ్వల స్థా**యికి** చేరింది.

ఎన్నెన్నో మార్పుల ప్రభంజనం

నగరాభివృద్ధి **'దిశ' మారడంతో 138 ఏళ్ల పాటు కురుపాం మార్కెట్ పరిసరాల్లో కాంతులీనిన బంగారం వ్యాపా**రం కాస్త కళ **తగ్గింది. వర్తకు**లు ముందు **చూపుతో** కొత్తగా అభివృద్ధి **చెందిన** ద్వారకానగర్ **పరిస**రాల్లో మార్కెట్ **కేం**ద్రీకృతం కావడం మొదలైంది. **ఈ**లోగా షాపింగ్ **మా**ల్స్, భారీ **వా**ణిజ్య కేంద్రాల **ఆ**విర్భావంతో **మా**ర్కెట్ స్వరూపం **మరి**ంత మారింది. **సంప్ర**దాయ వ్యాపారా**నికి ప్రాధా**న్యం తగ్గి సరి**కొత్త షాపింగ్ లక్షణం జోరందుకుంది.** బంగారం వ్యాపారం కూడా దీని ప్రభావానికి లోనైంది. ఇంటిల్లిపాదికి అవసరమయ్యే వస్త్రాలు, బంగారు, వెండి వస్తువులు, గృహోపకరణాలు అన్నీ ఒకేచోట లభ్యమయ్యే షాపింగ్ మాల్స్ ఆశీలుమెట్ట, ద్వారకానగర్, వీఐపీ రోడ్డు, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వెలిశాయి. అత్యంత ఖరీదైన వజ్ర, వైడుర్యాలు, విలువైన జాతి రాళ్లు పొదిగిన వజ్రాభరణాలు, చేయి తిరిగిన డిజైనర్లు రూపొందించిన వందల రకాల డిజైన్లతో కూడిన ఆభరణాలు, గాజులు, చెవి దిద్దులు, ఉంగరాలు ఇలా పలు రకాల వస్తువులు వీటిలో లభ్యమవుతున్నాయి. భారీ ప్రచారం, విస్తృతమైన రేంజ్, దేశ వ్యాప్తంగా దుకాణాలు ఉన్న భారీ వాణిజ్య సంస్థల ఆఫర్లు, ఇలా బంగారం వ్యాపారంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి.

కురుపాం మార్కెట్‌పై వెలుగు సంతకం

అగ్రహారపు గున్నయ్య గుప్తా, మంగళగిరి సీతారామయ్య, మంచుకొండ కోదండరామయ్య, విజయనగరం వాస్తవ్యులు నాగులకొండ వెంకట శ్రీనివాస పెరుమాళ్లు.. ఇలా నగరంలో ఎందరో బంగారు వర్తకులు తమ వ్యాపారాలను ప్రారంభించడంతో పుత్తడి వర్తకం విరాజిల్లిందనే చెప్పుకోవాలి. బంగారు వ్యాపారమంటే కురుపాం మార్కెట్ అన్న పేరు స్థిరపడిపోయింది. 1980ల నాటికి ఉన్న ఐదారు బంగారు దుకాణాలు 1990కి వందకు చేరుకున్నాయి. 2000 సంవత్సరంలో ప్రభుత్వం రూ.5 లక్షల టర్నోవర్‌కు తక్కువ ఉన్న బంగారు దుకాణాలకు ఆర్సీ అక్కరలేదని, సేల్స్‌టాక్స్‌తో పనిలేదని ప్రకటించడంతో వంద దుకాణాలు కాస్తా 150కి పెరిగాయి. ఇప్పటి టౌన్‌కొత్త రోడ్డు నుంచి కురుపాం మార్కెట్ వరకూ సుమారు 200 బంగారు దుకాణాలు ఏర్పడ్డాయి. దుకాణాలను ఏర్పాటు చేసిన వారిలో 40 శాతం విశాఖ నగరానికి చెందినవారైతే... మిగిలిన వారు శ్రీకాకుళం, విజయనగరం, బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం ప్రారంభించి స్థిరపడ్డారు. తయారు చేసే స్వర్ణకారులు సుమారు వెయ్యిమంది వరకూ విశాఖలో ఉన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారి దుకాణాలు కురుపాం మార్కెట్ ప్రాంతంలో ఉండడం మరో విశేషం.

నేటికీ తరగని అభిమానం..

నగరంలో భారీ షాపింగ్‌మాల్స్ వచ్చినా నేటికీ చాలా మంది కురుపాం మార్కెట్‌లోని బంగారు దుకాణాలకు వెళ్లి తమకు కావాల్సిన వస్తువులకు ఆర్డర్ ఇస్తున్నారు. తరతరాలుగా గల అనుబంధాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. వ్యాపారులతో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని, స్నేహాన్ని ఈ తరంలోనూ కాపాడుకుంటున్నారు. నచ్చిన డిజైన్‌ను అందంగా తీర్చిదిద్ది సకాలంలో అందజేయడం, బంగారం నాణ్యతకు హామీ ఇవ్వడం, షాపింగ్ మాల్స్‌లో లభించినట్టే '96.1 కేడీఎం' బంగారు నగలు లభించడంతో కురుపాం మార్కెట్ బంగారం దుకాణాల వైపు చాలా మంది మొగ్గు చూపుతున్నారు.

గత వైభవం తథ్యం

రహదారి విస్తరణతో కురుపాం మార్కెట్ బంగారు దుకాణాలకు గత వైభవం తిరిగి వస్తుందని ఆశిస్తున్నాం. తరతరాలుగా ఇదే వ్యాపారాన్ని నమ్ముకుని జీవిస్తున్న మాకు మరో వ్యాపారం చేయడం చేతకాదు. ఈ ప్రాంతం మీద మమకారంతో ఇక్కడే ఉన్నాం – **రామయ్య**, బంగారు వ్యాపారి

అమ్మకాల తగ్గుదల నిజమే..

గతంతో పోల్చితే బంగారం, వెండి అమ్మకాలు బాగా తగ్గాయి. షాపింగ్ మాల్స్ ప్రభావం కనిపిస్తోంది. అలవాటుగా మా వద్దకు వచ్చే కొనుగోలుదారులు తప్పకుండా వస్తుంటారు. వినియోగదారుల నమ్మకాన్ని కోల్పోకుండా వ్యాపారం చేస్తున్నాం. – **సురేష్**, బంగారు వ్యాపారి

దివ్యాంగ పిల్లల గుర్తింపు కోసం సర్వే



దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్న సిబ్బంది

విశాఖ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అల్లిపురం భీమ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వి.శేషమ్మ మాట్లాడుతూ సర్వే ఈ నెల 24 వరకు జరుగుతుందన్నారు. అర్హులను గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గురూజీ చెంతకు పటక్‌నాథ్



పటక్‌నాథ్, గురూజీతో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార : ఏయూటీడీ వసతిగృహంలో ఆశ్రయం పొంది మానసిక సమస్యల నుంచి కోలుకున్న పటక్‌నాథ్‌ను ఆగ్రాలోని అతని గురూజీ రాదేనాథ్‌కు అప్పగించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఫిరోజాబాద్ జిల్లాలోని పింద్ గ్రా గ్రామానికి చెందిన పటక్‌నాథ్ చాలా కాలం ఆగ్రాలో గురూజీ వద్ద జీవించాడు. రెండేళ్ల కిందట తీర్థయాత్రలకు వెళ్లి విశాఖ చేరుకుని రైల్వే స్టేషన్‌లో సంచరించడంతో ఏయూటీడీలో ఆశ్రయం కల్పించారు. వైద్య సేవల అనంతరం మానసిక స్థితి మెరుగుపడడంతో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు విశాఖపట్నం నుంచి ఆగ్రా తీసుకెళ్లి గురూజీ రాదేనాథ్‌కు బుధవారం అప్పగించారు.

మహిళకు ఏయూటీడీలో ఆశ్రయం

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ మహిళకు ఏయూటీడీ వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధి పరదేశిపాలెంలో సుమారు 45 సంవత్సరాల వయసు గల మహిళ మతి స్థిమితం లేకుండా తిరుగుతుండడంతో స్థానికులు 112కి సమాచారమిచ్చారు. పీఎం పాలెం పోలీసులు ఆమెను ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహం కార్యదర్శి వాసుకు అప్పగించారు. సంబంధీకులు 9440796060, 9704105886లో సంప్రదించాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, డైరెక్టర్లు, తదితరులు

అల్లిపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 76వ వార్షికోత్సవం బుధవారం విద్యుత్ శాఖ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ రక్తదాన శిబిరాన్ని, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ప్రోత్సహించేందుకు అతనితోపాటు ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రమ్ రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు విధులతోపాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) వి.విజయ లలిత, సీజీఎం డి.సుమన కళ్యాణి, ఎస్ఈ జి.శ్యామ్‌బాబు, 1104 యూనియన్ రీజినల్ అధ్యక్షుడు ఎ.నూకరాజు, రీజినల్ కార్యదర్శి ఎస్.చిరంజీవులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే పైప్‌లైన్ ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా గల అంబేడ్కర్ కల్యాణ మండపం వద్ద లీక్ కావడంతో తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ బుధవారం తెలిపారు. జోన్ – 3, 5, 8 పరిధిలో ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

- జోన్ – 3 పరిధిలో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీనగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్ – 16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియా, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 ఫీట్‌రోడ్డు తదితర ప్రాంతాలు.
- జోన్ – 5 పరిధిలో లక్ష్మీనారాయణపురం – 1, 2, లెపర్సీకాలనీ, కస్తూరినగర్ –1, శాంతినగర్ – 1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాష్‌నగర్, మహాత్మాగాంధీనగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్ద కొత్తూరు, అరుంధతినగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార ఉడా లే అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం ఉడా లేఅవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్ గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతినగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హుస్సేన్‌నగర్, ఆర్‌పీ పేట తదితర ప్రాంతాలు.
- జోన్ – 8 పరిధిలో లక్ష్మీనగర్ – ఎఫ్ బ్లాక్ పార్ట్, సీ, డీ బ్లాక్ పార్ట్, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీపురం, రజక కాలనీ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ నఫీసా బరోడావాలా

సీతంపేట : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను స్థానిక విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ రంగంలో 22 సంవత్సరాల అనుభవం ఉన్న నఫీసా బరోడావాలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనే యువత జస్ట్ ఏ మినిట్ సెషన్ ద్వారా తమ ఆలోచనా సామర్థ్యాలను పదును పెట్టుకుంటారని తెలిపారు. మాక్ ఇంటర్వ్యూ డ్రిల్ ద్వారా అనుభవాన్ని పొందుతారన్నారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టీమ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న స్కిల్స్ ప్రాక్టీస్ చేయడం ద్వారా తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూలో విజయం సాధిస్తారని తెలిపారు.

ఆర్‌టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదాన శిబిరంలో అప్పలనాయుడు, తదితరులు

డాబాగార్డెన్స్ : జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఏపీఎస్ ఆర్‌టీసీ విశాఖ డిస్పెన్సరీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన వారిలో ఎక్కువ మంది రక్తం పోవడంతో మరణిస్తున్నారన్నారు. అందువల్లే రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. రక్తదానం చేసిన 42 మంది ఆర్‌టీసీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణి నీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, అసిస్టెంట్ మేనేజర్ జీవీ గౌరి, అసోసియేషన్ నాయకులు, డిస్పెన్సరీ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వు నిధులతో అభివృద్ధి చేయాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకోవాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 135వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది ఉద్యోగుల కుటుంబాలు ఈ ఆస్పత్రి నుంచి వైద్య సేవలు పొందుతున్నాయని... అటువంటి ఆస్పత్రిని ప్రైవేటు వారి చేతిలో పెట్టడం సరికాదన్నారు. పోర్టు వద్ద ఉన్న రిజర్వు నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, గణేష్, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

చివరి ఇంక్రిమెంట్‌కు ఆమోదం

తాటిచెట్లపాలెం: రైల్వేలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చివరి ఇంక్రిమెంట్‌ను రైల్వే బోర్డు మంజూరు చేసిందని, ఇది కార్మికులకు ఎంతో ఉపయోగమని సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. గతంలో రైల్వేలో పూర్తి కాలం సర్వీసు చేసి పదవీ విరమణ పొందిన వారికి చివరి ఇంక్రిమెంట్ ఉండేది కాదని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలను కోల్పోయేవారన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో పోరాటాలు, కోర్టు కేసుల ద్వారా పోరాడడంతో ఎట్టకేలకు రైల్వే బోర్డు అంగీకరించిందని తెలిపారు. 2023, 1 మే నుంచి పదవీ విరమణ పొందిన వారందరికీ వర్తిస్తుందని ఆయన తెలిపారు. లక్షలాది మంది ఉద్యోగులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



జలాభిషేకం కోసం నీరు తీసుకొస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ చేశారు. అనంతరం అమ్మవారికి మాఘ పౌర్ణమి సందర్భంగా మహా కుంభమేళా ప్రయాగరాజ నుంచి తీసుకొచ్చిన గంగా యమునా సరస్వతి నదుల పవిత్ర జలాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకం జరిపారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీరతో పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీఎరుకుమాంబ అమ్మవారు దేవతామూర్తిగా (పార్వతీదేవి) ఈ ప్రాంతంలో అవతరించారని నమ్మే భక్తులు ప్రతీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు... మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పసుపు నీళ్లతో అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పసుపు నీళ్లతో అభిషేకం చేయడం వల్ల వారి కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రతీ బుధవారం దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూ కాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలిత నగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్‌తోపాటు గాజువాక, దువ్వాడ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వహస్తాలతో పసుపు నీళ్ల అమ్మవారికి పోస్తారని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

వైభవోపేతంగా శ్రీలలితాదేవి నగరోత్సవం



శ్రీలలితాదేవి పల్లకీ ఊరేగింపులో భక్తులు

సీతంపేట : శ్రీలలితాపీఠం వార్షికోత్సవాల ముగింపు, మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీలలితాదేవిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై బుధవారం సాయంత్రం ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పిటగుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, డైమండ్ పార్క్, దొండపర్తి కూడలి, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. అమ్మవారి పల్లకీ మోయడానికి భక్తులు పోటీ పడ్డారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి టాపులేని కారులో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా ఉదయం పీఠంలో లలితాదీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమించారు. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు పన్ను మినహాయింపునకు వినతి

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆదాయ పన్ను శాఖ అధికారులను కలసి వినతి పత్రం అందజేసినట్లు డాక్టర్ ఎం.సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీలు అత్యధికంగా పనిచేస్తున్నందున వర్సిటీ నుంచి లెటర్ పంపిస్తే, దీనిపై పరిశీలన చేస్తామన్నారని సురేష్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ అధికారులు ఫామ్–13 అప్లై చేసి అతిథి అధ్యాపకులకు టీడీఎస్ నుండి మినహాయింపు పొందే అవకాశం కల్పించాలని కోరారు.